# సాక్షి
## భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం, 12, జూన్, 2023






**'పీఆర్'లో ఇన్‌చార్జ్ పాలనే..**

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రస్తుతం ఇన్‌చార్జ్ అధికారుల పాలనే దిక్కయింది.

8లో



**ఆకు లక్ష్యం.. ఆమడదూరంలో**

ఆదివాసీ, గిరిజనులు వేసవి పంటగా భావించే తునికాకు సేకరణ లక్ష్యం ఈ ఏడాది కూడా నెరవేరలేదు.

10లో

**వాతావరణం**

గరిష్ఠం / కనిష్ఠం 42° / 29°

జిల్లాలో సోమవారం ఎండల ప్రభావం మెండుగా ఉంటుంది. రాత్రి పూట కూడా వడగాలులు వీస్తాయి.

## రామయ్య దర్శనం.. ఆపై ఖమ్మం



- ఈనెల 15న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటన
- ఖమ్మంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు.. ఆ తర్వాత సభలో ప్రసంగం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఖమ్మం పర్యటన ఖరారైంది. మంత్రి ఈనెల 15న ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు హాజరవుతారని ఇప్పటికే ప్రకటించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు తాజాగా ఏర్పాట్లను పరిశీలించారు. ఈమేరకు ఆదివారం మంత్రి పర్యటన షెడ్యూల్‌ను పార్టీ వర్గాలు వెల్లడించాయి.

**ఢిల్లీ నుంచి భద్రాద్రి వయా హైదరాబాద్**

కేంద్ర హోం మంత్రి అమిత్‌షా 15వ తేదీన గురువారం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ వస్తారు. శంషాబాద్‌లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొన్నాక హెలీకాప్టర్‌లో మధ్యాహ్నం 2.10గంటలకు భద్రాచలం చేరుకుంటారు. అక్కడ శ్రీసీతారామ చంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం హెలీకాప్టర్‌లోనే సాయంత్రం నాలుగు గంటలకు ఖమ్మం చేరుకుని ఎన్టీఆర్ సర్కిల్‌లోని దివంగత సీఎం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం ఎస్ఆర్‌అండ్‌బీ జీఎన్ఆర్ మైదానంలో జరిగే బీజేపీ సభలో అమిత్‌షా ప్రసంగిస్తారు. ఆతర్వాత సాయంత్రం ఆరు గంటలకు ఇక్కడి నుంచి హైదరాబాద్ బయలుదేరతారు.

## న్యూస్‌రీల్

### రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ఆదివారం వైభవంగా అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తెల్లవారు జామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భారీగా హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### శ్రీకనకదుర్గమ్మ తల్లికి విశేష పూజలు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం–జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారి ఆలయంలో ఆదివారం విశేష పూజలు, అభిషేకం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తలనీలాలు, ఒడిబియ్యం, చీరలు, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ ఎస్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు చందుపట్ల శ్రీనివాసరెడ్డి, చింతా నాగరాజు, కిలారు నాగేమల్లేశ్వరరావు, గంధం వెంగళరావు, సంకా వెంకటరామారావు, పాయం పాపయ్య పాల్గొన్నారు.

కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించన ప్రజాగర్జన సభకు భారీగా హాజరైన పార్టీ కార్యకర్తలు



# ఇదీ మా బలం.. బలగం!

- లక్ష మంది వస్తారన్నాం.. వచ్చారు
- కమ్యూనిస్టుల పని అయిపోయిందన్న వారు ఇప్పుడు సమాధానం చెప్పాలి
- గడల రాజకీయం చేయాలంటే ఉద్యోగం వదిలేయాలి
- పొంగులేటిది డబ్బు ఉందనే అహంభావమే
- ప్రజాగర్జన సభలో సీపీఐ జాతీయ నేత నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



సభలో అభివాదం చేస్తున్న సీపీఐ నాయకులు నారాయణ, కూనంనేని, చాడ వెంకటరెడ్డి తదితరులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/సింగరేణి(కొత్తగూడెం): సర్కారు కొలువులో ఉన్నోళ్లు రాజకీయాలు చేస్తున్నారు. అవ్వా కావాలి, బువ్వా కావాలి అంటే ఎలా అని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్‌రావును ఉద్దేశించి సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పరోక్షంగా విమర్శించారు. రాజకీయాల్లోకే రావాలని ఉంటే ఉద్యోగానికి రాజీనామా చేయాలని సూచించారు. ఇక కేవలం డబ్బుందనే అహంభావంతో పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నారని, ప్రజా క్షేత్రంలో ఆయన చేసిన పోరాటాలు ఏమిటని నారాయణ ప్రశ్నించారు. కొత్తగూడెంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జరిగిన ప్రజా గర్జన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తమది రాజకీయ పార్టీ అని, ప్రజా క్షేత్రంలో తమకు బలం ఉన్న స్థానాల్లో కచ్చితంగా బరిలో ఉంటామని అన్నారు. పొత్తుల్లోనూ ఈ స్థానాలను తమ హక్కుగా కోరుతామని ఆయన స్పష్టం చేశారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.25వేలు చెల్లించాలంటూ న్యాయస్థానం ఇచ్చిన తీర్పు సింగరేణిలో కూడా అమలు కావడం లేదని మండిపడ్డారు.





**కొత్తగూడెం వచ్చి చూడండి..**

కమ్యూనిస్టుల పని అయిపోయిందని విమర్శలు చేస్తున్న వారు కొత్తగూడెంలో జరుగుతున్న ప్రజాగర్జన సభను చూసి, తమ బలమెంతో తెలుసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రజలంతా స్వచ్ఛందంగా చందాలు వేసుకుని వాహనాల్లో, మరికొందరు నడుచుకుంటూ వచ్చారని తెలిపారు. లక్ష మందితో కొత్తగూడెంలో సభ నిర్వహిస్తామని చెప్పి, చేసి చూపించామని అన్నారు. ఒక్క రూపాయి ఇవ్వకపోయినా సభకు వచ్చిన కార్యకర్తలు, అభిమానులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని అన్నారు. కమ్యూనిస్టుల పని అయిపోందని విమర్శలు చేసేవారు తరచుగా తమ నామజపమే చేస్తుంటారని ఎద్దేవా చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తెలంగాణవాదాన్ని బలంగా తీసుకెళ్లింది సీపీఐ మాత్రమేనని తెలిపారు. ప్రస్తుత సీఎం కేసీఆర్‌ను అరెస్ట్ చేసి ఖమ్మం తరలించినప్పుడు ఆయనకు అండగా నిలిచామన్నారు. బీజేపీ హఠావో.. దేశ్‌కో బచావో నినాదంతో తాము చేపట్టిన ప్రజాపోరు యాత్ర ద్వారా తమ భావజాలాన్ని కోటి మంది ప్రజలకు చేరవేశామని వివరించారు.

### ఇంకా ఎవరేం అన్నారంటే...

నీకెంత, నాకెంత బలం ఉందని చెప్పే కాకిలెక్కలతో రాజకీయ ఐక్యత సాధ్యం కాదని సీపీఐ జాతీయ నాయకుడు మహేష్ కుంజ అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుంకు వ్యతిరేకంగా పోరాడానని, తాను సీపీఐ వర్గీయుడినని అక్కడి అధికార పార్టీ నాయకులు, పోలీసుల సహకారంతో చిత్రహింసలు పెట్టినా వెనక్కి తగ్గలేదని గుర్తుచేశారు. రెండు పర్యాయాలు ఎన్నికల్లో పోటీ చేసి 100, 200 ఓట్ల తేడాతో ఓడిపోయినా, గిరిజన హక్కుల సాధనకు పోరాడే క్రమాన అనేక పర్యాయాలు కేసుల పాలయ్యాయని తెలిపారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజాకార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ రానున్న ఎన్నికల్లో ఓడించే శక్తి సీపీఐకి మాత్రమే ఉందని జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి తెలిపారు. దేశంలోని 20 రాష్ట్రాల్లో ఉన్న సీపీఐకి జాతీయ పార్టీ హోదా రద్దు చేయడంలో దురుద్దేశముందని విమర్శించారు. అయితే, తమ పోరాటాన్ని ఆపేందుకు యత్నిస్తే ఫలితం ఉండకపోగా, వారికే నష్టం జరుగుతుందని తెలిపారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ.. లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధినిస్తున్న సింగరేణిని ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచనను కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మూల్యం చెల్లించక తప్పదని పేర్కొన్నారు. అనంతరం ప్రజాగర్జన బహిరంగ సభ అజెండాను కూనంనేని సాంబశివరావు వివరించారు. సింగరేణి ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, కార్మికులందరికీ సొంతింటి సౌకర్యం, రిటైర్డ్ కార్మికులకు నివసిస్తున్న క్వార్టర్ల కేటాయింపు, పెన్షన్ పెంపు, విభజన హామీలైన బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం తదితర డిమాండ్లతో ఉద్యమాలు చేపడుతామని తెలిపారు. ఈ సభలో పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, నాయకులు పశ్య పద్మ, తొక్కోళ్ల పల్లి శ్రీనివాసరావు, ఇట్టి నర్సింహం, కలివెల శంకర్, బాల మల్లేష్, బాల నర్సింహా, పోటు ప్రసాద్, ఎస్.కే.సాబీర్‌పాషా, అయోధ్య, రావులపల్లి రాంప్రసాద్, మహ్మద్ మౌలానా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### కదం తొక్కిన ఎర్రదండు..

ప్రజాగర్జన బహిరంగ సభ నేపథ్యంలో కొత్తగూడేనికి రాష్ట్ర నలుమూలల నుంచి ఎర్రదండు కదం తొక్కింది. ఎర్ర చొక్కా, ఎర్ర చీర, చేతిలో ఎర్రజెండాతో సీపీఐ కార్యకర్తలు, మద్దతుదారులు ప్రైవేట్ వాహనాల్లో, బస్సుల్లో, ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు సాయంత్రం నాలుగు గంటల సమయానికే వేదిక వద్దకు వచ్చారు. సాయంత్రం ఆరు గంటల సమయానికి కూడా సభా ప్రాంగణం పూర్తిగా నిండలేదు. ఓ వైపు ఎండలు దంచి కొడుతుండటం, మరోవైపు ముందుగా ప్రకటించినట్టు 4వ తేదీన కాకుండా 11వ తేదీకి సభ మారడంతో ఆశించిన స్థాయిలో జన సమీకరణ జరగలేదనే భావన ఏర్పడింది. దీనికి తోడు సీపీఐకి పట్టున్న సింగరేణిలో కార్మికుల సంఖ్య లక్షకు పైస్థాయి నుంచి ఇప్పుడు 40 వేలకు పడిపోవడం కూడా సభపై ప్రభావం చూపుతుందనే అభిప్రాయం కలిగింది. అయితే రాత్రి 7 గంటల సమయానికి ప్రకాశం స్టేడియం లోపలా, బయట జనాలతో నిండిపోయింది. దీంతో తాము ముందుగా చెప్పినట్టు లక్ష మందితో సభను సక్సెస్ చేశామని కూనంనేని హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ సభ విజయవంతం కావడం సీపీఐ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. సభావేదికపై ప్రజా నాట్యమండలి కళాకారుల ఆటపాటలు సభికులను ఆకట్టుకున్నాయి.

# 'గ్రూప్ –1' ప్రశాంతం





పాల్వంచలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు, ఆలస్యంగా వచ్చిన అభ్యర్థిని అడ్డుకుంటున్న సిబ్బంది

**పరీక్షకు 59.38 శాతం మంది అభ్యర్థుల హాజరు**

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో గ్రూప్–1 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య పరీక్ష నిర్వహించగా 59.38 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 8,851 మందికి గాను 5,258 మంది పరీక్ష రాశారు. పరీక్ష నిర్వహణపై కలెక్టర్ అనుదీప్, ఎస్పీ డాక్టర్ వినీత్ కొన్ని రోజులుగా ఏర్పాటు చేసిన సమావేశాలు సత్ఫలితాలిచ్చాయి. అభ్యర్థులు పాటించాల్సిన నియమ నిబంధనలపై కూడా విస్తృత ప్రచారం చేశారు. సుజాతనగర్‌లో 1, కొత్తగూడెంలో 8, లక్ష్మీదేవిపల్లిలో 4, పాల్వంచలో 9 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం 8.30 గంటల నుంచే అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. ఆయా సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు 100 మీటర్ల దూరం వరకు ఇతరులెవరినీ అనుమతించలేదు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్ష విజయవంతం కావడంతో కలెక్టర్ అనుదీప్, ఎస్పీ వినీత్ సిబ్బందిని అభినందించారు.

**తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ**

పాల్వంచరూరల్/పాల్వంచ : పాల్వంచ పట్టణంతో పాటు మండలంలోని లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల సెంటర్లలో ఆదివారం భారీ పోలీసు బందోబస్తు నడుమ గ్రూప్–1 పరీక్ష నిర్వహించారు. అభ్యర్థులను మెటల్ డిటెక్టర్‌తో తనిఖీ చేసి కేంద్రాల్లోకి పంపించారు. బెల్టులు, షూ, రింగ్‌లు, చైన్లు, వాచ్‌లు, సెల్‌ఫోన్లు అనుమతించలేదు. పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 10.15 నిమిషాలకు గేటు మూసేసే సమయంలో ఓ మహిళా అభ్యర్థి పరుగెత్తుకుంటూ రాగా, మొదట ఆమెను బయటే నిలిపేశారు. ఆ తర్వాత పోలీసుల సూచనతో లైజన్ ఆఫీసర్ మరియన్న లోనికి పంపించారు. పలువురు మహిళా అభ్యర్థులు చంటి పిల్లలను ఎత్తుకుని పరీక్షకు హాజరయ్యారు. కాగా, పలు కేంద్రాలను కలెక్టర్ అనుదీప్, ఎస్పీ వినీత్, అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు తదితరులు తనిఖీ చేశారు.

# ఉద్యమ దివిటీలు కవులు, కళాకారులే



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యేలు వనమా, హరిప్రియ, కలెక్టర్ అనుదీప్

**సాహితీ దినోత్సవంలో ఎమ్మెల్యే వనమా, కలెక్టర్ అనుదీప్**



కలెక్టరేట్‌లో సన్మానం అందుకున్న కళాకారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ ఉద్యమ దివిటీలు కవులు, కళాకారులేనని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీలో ఆదివారం జరిగిన సాహితీ దినోత్సవ వేడుకలను ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కవులు, కళాకారులకు జిల్లా పుట్టినిల్లు అన్నారు. తెలంగాణ తొలిదశ ఉద్యమం పాల్వంచ నుంచే ప్రారంభమైందని గుర్తుచేశారు. సాహిత్యంపై సీఎం కేసీఆర్‌కు ఎనలేని ప్రేమ ఉందని, ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు తెలియజేసేందుకు సాహిత్య దినోత్సవం జరుపుకుంటున్నామని చెప్పారు. దశాబ్ది ఉత్సవాల్లో కవులు, కళాకారుల త్యాగనిరతిని స్మరించుకోవడం హర్షణీయమన్నారు. కలెక్టర్ అనుదీప్‌మాట్లాడుతూ.. కవుల కలాల నుంచి జాలువారిన సాహిత్యం తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎంతగానో ఉపకరించిందన్నారు. తెలంగాణ వద్దని అడ్డుపడిన వారిని సాహితీ వేత్తలే చైతన్యపర్చారని చెప్పారు. సాహితీ వేడుకలకు చిన్నారులు సైతం రావడం హర్షణీయమన్నారు. ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ మాట్లాడుతూ ప్రజలను చైతన్య పరిచేలా నాటి నుంచి నేటి వరకు కాళోజీ నారాయణరావు నుంచి సుద్దాల అశోక్‌తేజ వరకు తమ కళలతో ప్రజలను జాగృత పరిచారని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, డీపీఆర్ఓ శీలం శ్రీనివాసరావు, మహిళా సంక్షేమాధికారి సబిత, సీపీఓ శ్రీనివాసరావు, విద్యాశాఖ కో ఆర్డినేటర్ సైదులు, సీనియర్ కవులు దిలావర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సాహితీవేత్తల పాత్ర కీలకం



రామదాసు విగ్రహం వద్ద కలెక్టర్, ఆర్‌డీఓ, ఈఓ

భద్రాచలం: తెలంగాణ చరిత్ర, ఉద్యమంలో ఎంతో మంది కవులు, కళాకారులు కీలకపాత్ర పోషించారని కలెక్టర్ అనుదీప్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భద్రాద్రి రామాలయంలో నిర్వహించిన సాహితీ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలోని భక్త రామదాసు విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం మాట్లాడుతూ.. అంతరించిపోతున్న సాహిత్యానికి ఎందరో సాహితీవేత్తలు, కవులు, రచయితలు తమ రచనలతో దిశా నిర్దేశం చేస్తున్నారని తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన కంచర్ల గోపన్న, ఆదికవి హరిబట్టు, దాశరథి కృష్ణమాచార్యులు సాహితీపరంగా ధ్రువతారలుగా నిలిచారని కొనియాడారు. భక్త రామదాసు శ్రీరాముడిపై అనేక రకాల పద్యాలు, పాటలు రచించి రాముడి మెప్పు పొందారని, అలాంటి భక్తున్ని దశాబ్ది ఉత్సవాల్లో భద్రాచలంలో స్మరించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. నేటితరం యువకులు కవులను, సాహితీ వేత్తలను, స్ఫూర్తిగా తీసుకుని కళలు అంతరించిపోకుండా కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ రమాదేవి, ఆర్‌డీఓ రత్న కళ్యాణి, ఆలయ ఈఈ రవీందర్, ఏఈఓ శ్రవణ్‌కుమార్, సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓ రామకృష్ణ, సీఐ నాగరాజు, పంచాయతీ ఈఓ వెంకటేశ్వర్లు, ఐకేపీ సీసీ సీతారాములు, సీసీ అనిల్ పాల్గొన్నారు.

# బడికి రెడీ..



కొత్తగూడెంలోని బాబూక్యాంపు పాఠశాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది



- నేడు పాఠశాలలు పునః ప్రారంభం
- సిద్ధమైన ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు
- 'సర్కారు'లో తరగతి గదులు, ఉపాధ్యాయుల కొరత
- పూర్తి కాని మన ఊరు – మన బడి పనులు

కొత్తగూడెంఅర్బన్: నూతన విద్యా సంవత్సరం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకోసం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు సిద్ధమయ్యాయి. గతేడాది పండుగ వాతావరణంలో పాఠశాలను ప్రారంభించాలని రాష్ట్ర విద్యాశాఖ ఆదేశించింది. అయితే ఈ ఏడాది దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈనెల 20న విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. దీంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను నేడు సాధారణంగానే ప్రారంభించనున్నారు. పాఠశాల ప్రాంగణాలతో పాటు తరగతి గదులను, మధ్యాహ్న భోజన వంట పాత్రలను ఇప్పటికే శుభ్రం చేశారు. ఇక ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం అందజేయనున్న యూనిఫాం ఒక్కో జతతో పాటు పాఠ్యపుస్తకాలు, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అందించే నోట్ పుస్తకాలు స్కూళ్లకు చేరుకున్నాయి. వాటి పంపిణీకి హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం, ఉక్కపోత వంటి సమస్యలతో విద్యార్థులు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

**సరిపడా గదులేవీ..?**

జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా గదులు లేవు. దీంతో చెట్ల కిందే తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో మన ఊరు–మన బడి పథకం కింద 368 పాఠశాలలను మొదటి విడతలో ఎంపిక చేయగా, ఇప్పటివరకు ఇల్లెందు, అశ్వారావుపేట మండలాల్లో 3 పాఠశాలలు ప్రారంభం కాగా, మరో 40 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. మిగిలిన పాఠశాలల్లో పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇవన్నీ పూర్తయితే విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపడే అవకాశం ఉంది. ఇక పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఉంది. ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాలపైనా ఈ ప్రభావం కనిపించింది. ఈ ఏడాదైనా ముందస్తు చర్యలు చేపట్టి ఆ టీచర్ల కొరతను అధిగమించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ఈ ఏడాది కొత్త సౌకర్యాలివే..**

ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో నూతన పథకాలు అమల్లోకి రానున్నాయి. ప్రధానంగా పాఠశాలల్లో లైబ్రెరీలు ప్రారంభం కానున్నాయి. అందుకు కావాల్సిన కథల పుస్తకాలు, వివిధ రచనలు ఇప్పటికే చేరుకున్నాయి. ఎంపిక చేసిన పాఠశాలల్లో డిజిటల్ టీవీలు ఏర్పాటు చేసి, విద్యార్థులకు సాంకేతిక విద్యను అందుబాటులోకి తేనున్నారు. ఇంగ్లిష్ మీడియం బోధనను పూర్తి స్థాయిలు అమలు చేయనున్నారు.

**జిల్లా విద్యార్థుల వివరాలిలా..**

జిల్లాలో విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలు 791, ఉన్నత పాఠశాలలు 109, 1 నుంచి 8వ తరగతి వరకు గల పాఠశాలలు 164, కేజీబీవీలు14, టీఎస్ఆర్ఈఎస్ 1, యూఆర్ఎస్ 1.. మొత్తం 1080 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 70,445 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక అన్ని మేనేజ్‌మెంట్ స్కూళ్లు కలిపి 1,643 ఉండగా, బాలురు 77,196 మంది, బాలికలు 75,112 మంది, మొత్తం 1,52,308 మంది విద్యనభ్యసిస్తున్నారు.

**ప్రారంభానికి ఏర్పాట్లు చేశాం**




వేసవి సెలవుల తర్వాత పాఠశాలల పునఃప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. మొదటి రోజు నుంచే మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. దీంతో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం కూడా అందజేసేందుకు ఏర్పాట్లు చేశాం. నూతన విద్యా సంవత్సరం సోమవారం ప్రారంభం అవుతున్నందున విద్యార్థులంతా పాఠశాలలకు హాజరు కావాలి. బడిబాట కార్యక్రమం ద్వారా ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించాం. దీంతో ఈ ఏడాది పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య గణనీయంగా పెరగనుంది.

– సోమశేఖరశర్మ, డీఈఓ

## క్లుప్తంగా

### గ్రూప్ - 1 పరీక్షలో గౌతంపూర్!




గ్రూప్-1 ప్రశ్నపత్రంలోని ఓ ప్రశ్న

చుంచుపల్లి: జాతీయస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డు పొందిన చుంచుపల్లి మండలం గౌతంపూర్ ప్రస్తావన ఆదివారం జరిగిన గ్రూప్–1 ప్రశ్నపత్రంలో వచ్చింది. '2021–22 సంవత్సరానికి గాను 2023లో ప్రకటించిన 46 జాతీయ పంచాయతీ అవార్డుల్లో తెలంగాణ రాష్ట్రం 13 అవార్డులు గెలుచుకుంది. ఈ క్రింది గ్రామాలను వాటి అవార్డు వర్గంతో జతపర్చండి' అని ఇచ్చిన ప్రశ్నలో జాతీయస్థాయిలో ఆరోగ్య పంచాయతీగా అవార్డు దక్కించుకున్న గౌతంపూర్‌కు కూడా స్థానం దక్కింది. గత నెల 17న ఢిల్లీలో జీపీ బాధ్యులు రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకోగా, రూ.కోటి నజరానా ఇచ్చినవిషయం తెలిసిందే.

### కానిస్టేబుల్‌పై డీఎస్పీ ఫైర్



కానిస్టేబుల్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్

పాల్వంచరూరల్: 'గ్రూప్ – 1 పరీక్ష కేంద్రం వద్ద విధులు నిర్వర్తించకుండా ఎక్కడ తిరుగుతున్నావు? అసలు నీ డ్యూటీ ఎక్కడ?'అని పట్టణ కానిస్టేబుల్ శ్రీధర్‌పై డీఎస్పీ వెంకటేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల వద్ద ఆదివారం జరిగిన గ్రూప్ – 1 పరీక్ష కేంద్రంలో డీఎస్పీ వెంకటేశ్, సీఐ నాగరాజు తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో ఎదురుగా రోడ్డుపై ఇసుక లారీని కానిస్టేబుల్ శ్రీధర్ నిలిపివేశాడు. అది చూసిన సీఐ విషయాన్ని డీఎస్పీకి చెప్పాడు. కానిస్టేబుల్‌ను పిలిచి 'నీ డ్యూటీ ఎక్కడ? అటు వైపు ఎందుకు వెళ్లావు?'అని ఫైర్ అయ్యాడు.

### జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



జంపన్న

పాల్వంచ: జాతీయస్థాయి సీనియర్ రగ్బీ పోటీలకు బూర్గంపాడు మండలం గోపాలపురం గ్రామానికి చెందిన యాసం జంపన్న ఎంపికైనట్లు రగ్బీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ జి.సతీశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జంపన్న మణుగూరు కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడని, ఇటీవల రాష్ట్రస్థాయి సీనియర్ రగ్బీ పోటీల్లో ప్రతిభ చూపి ఈ నెల 14, 15 తేదీల్లో పుణెలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నాడని ఆయన వివరించారు.

### అంతరాష్ట్ర క్రికెట్ టోర్నీ విజేత బైరాగులపాడు



ట్రోఫీతో బైరాగులపాడు క్రీడాకారులు

దుమ్ముగూడెం: గొల్లపల్లి గ్రామంలో జరిగిన 3 రాష్ట్రాలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో బైరాగులపాడు జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో గొందిగూడెం జట్టుతో తలపడిన బైరాగులపాడు జట్టు విజేతగా నిలిచి రూ.30 వేల నగదు, షీల్డ్‌ను అందుకుంది. అంతరాష్ట్ర టోర్నీలో విజేతగా నిలవడంతో బైరాగులపాడు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గొల్లపల్లి సర్పంచ్, ఎస్‌ఐ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు.

### జలాశయంపై సందడి



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: మండలంలోని పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానికి ఆదివారం జిల్లా నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా పర్యాటకులు వచ్చి కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా గడిపారు. డీర్ పార్కులోని దుప్పులు, డ్యామ్ పైనుంచి జలాశయం వీక్షించారు. పర్యాటకుల ద్వారా వైల్డ్‌లైఫ్ విభాగానికి రూ.21,055.. బోటింగ్ ద్వారా రూ.17,360 ఆదాయం టూరిజం శాఖకు లభించింది.

# 'పీఆర్'లో ఇన్‌చార్జ్ పాలనే..

- రెగ్యులర్ ఉద్యోగులు లేక ఇబ్బందులు
- సబ్‌డివిజన్లలో వేధిస్తున్న డీఈల కొరత
- పట్టించుకోని శాఖ ఉన్నతాధికారులు



కొత్తగూడెంలోని పంచాయతీరాజ్ విభాగం కార్యాలయం

చుంచుపల్లి : ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ విరమణతో కొన్ని, బదిలీలతో మరికొన్ని ఖాళీలు ఏర్పడుతున్నాయి. ఆ స్థానాల్లో మాత్రం తిరిగి రెగ్యులర్ అధికారులు రావడం లేదు. ఆ శాఖలో ఉన్న అధికారులకే ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ఏళ్లుగా రెగ్యులర్ అధికారులు లేక పాలన కుంటుపడుతోంది. జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో పలు రెగ్యులర్ పోస్టులు కొన్నేళ్లుగా ఖాళీగానే ఉంటున్నాయి.

**అదనపు బాధ్యతలతో భారం..**

ప్రభుత్వ శాఖల్లో ప్రధానమైన వాటిలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఒకటి. ఆ విభాగంలో ప్రస్తుతం ఇన్‌చార్జ్ అధికారుల పాలనే దిక్కయింది. దీంతో వారిపై అదనపు భారం పడుతోంది. కొత్తగూడెం డివిజన్ ఈఈ కొండూరి సుధాకర్ వ్యక్తిగత కారణాలతో గత నెల 20న తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో ఖమ్మం పీఆర్ ఎస్‌ఈ జె.సుదర్శన్‌రావుకు బాధ్యతలు అప్పగించారు. ఇక ఇల్లెందు, కొత్తగూడెం పంచాయతీరాజ్ సబ్ డివిజన్ల పరిధిలో పనిచేస్తున్న డీఈలుగా ఏళ్లుగా ఇన్‌చార్జ్ అధికారులే ఉన్నారు. నాలుగేళ్ల క్రితం కొత్తగూడెం డివిజన్ డీఈ సుధాకర్‌కు ఈఈగా అప్పట్లో అదనపు బాధ్యతలు అప్పగించగా అక్కడ డీఈగా అదనపు బాధ్యతలను వి.సత్యనారాయణకు ఇచ్చారు. ఆయన కూడా ఇటీవల సెలవుపై వెళ్లడంతో ఆ బాధ్యతలను అశ్వారావుపేట డీఈ వేణుగోపాల్ చూస్తున్నారు. ఇల్లెందు సబ్ డివిజన్‌లోనూ పూర్తిస్థాయి రెగ్యులర్ డీఈ లేక పాలనా పరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భద్రాచలం డివిజన్ డీఈ మంగ్యానాయక్ ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఈఈగా బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో రెండు డివిజన్‌లకు ఈఈ పోస్టులతో పాటు ఆ విభాగానికి పలువురు రెగ్యులర్ డీఈలు లేక పర్యవేక్షణ కొరవడుతోంది. బిల్లుల చెల్లింపుల్లోనూ తీవ్ర జాప్యం జరుగుతోందని పలువురు ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు అంటున్నారు. ఇప్పటికైనా పీఆర్‌లో పలు రెగ్యులర్ పోస్టుల భర్తీపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

**అభివృద్ధి పనులపై పర్యవేక్షణేది ?**

జిల్లాలో కొత్తగూడెం, భద్రాచలం రెండు పీఆర్ డివిజన్లు ఉన్నాయి. కొత్తగూడెం డివిజన్ పరిధిలో 12 మండలాలు, భద్రాచలం డివిజన్ పరిధిలో పది మండలాలు ఉన్నాయి. భద్రాచలం డివిజన్‌లో భద్రాచలం, బూర్గంపాడు, మణుగూరు పీఆర్ సబ్ డివిజన్లు, కొత్తగూడెం డివిజన్‌లో కొత్తగూడెం, ఇల్లెందు, అశ్వారావుపేట, ములకలపల్లి సబ్ డివిజన్లుగా విభజించారు. ఈ ఏడు సబ్ డివిజన్లలో భద్రాచలం, బూర్గంపాడు, మణుగూరు, అశ్వారావుపేట, ములకలపల్లిలో రెగ్యులర్ డీఈలు ఉండగా కొత్తగూడెం, ఇల్లెందులో ఇన్‌చార్జ్ డీఈలే బాధ్యతలు చూస్తున్నారు. వీటితో పాటు కొత్తగా ఏర్పడిన లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, ఆళ్లపల్లి, అన్నపురెడ్డిపల్లి, కరకగూడెం, సుజాతనగర్ మండలాలకు ఇంతవరకూ పంచాయతీరాజ్ ఏఈలను కేటాయించలేదు. పాత మండలాల ఏఈలే వీటికి ఇన్‌చార్జ్‌లుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పీఆర్ ఇంజనీరింగ్ విభాగంలో తగినంత సిబ్బంది లేకపోవడంతో తమపై అదనపు భారం పడుతోందని, ఒక్కొక్కరం రెండు, మూడు మండలాల బాధ్యతలు చూడాల్సి వస్తోందని ఇన్‌చార్జ్ అధికారులు అంటున్నారు. ప్రధానంగా పంచాయతీరాజ్ శాఖకు పీఎంజీఎస్‌వై, ఎస్‌డీఎఫ్, ఈజీఎస్, నాబార్డ్, డీఎంఎఫ్, మన ఊరు, మనబడి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వంటి పథకాల కింద నిధులు కేటాయిస్తారు. వీటితో గ్రామాల్లో బీటీ, సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్లు, కల్వర్టులు, అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, బ్రిడ్జిలు, ఇళ్ల నిర్మాణాల వంటివి చేపడతారు. వీటిపై పూర్తి పర్యవేక్షణ బాధ్యత పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికే ఉంటుంది. ప్రస్తుతం రెగ్యులర్ అధికారులతో పాటు తగిన సిబ్బంది లేక ఈ అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయిలో సరైన దృష్టి సారించలేకపోతున్నారు.



పరీక్ష కేంద్రంలోనికి వెళ్తున్న దివ్యాంగులు



పరీక్ష కేంద్రం ఎదుట తనిఖీ చేస్తున్న సిబ్బంది

# పక్కాగా.. పరీక్ష

**నిబంధనలతో అభ్యర్థుల బేజారు**



ఎస్పీ వినీత్‌ను తనిఖీ చేస్తున్న సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: గ్రూప్–1 పరీక్ష నిబంధనలతో అభ్యర్థులు కొంతమేర ఇబ్బందులు పడ్డారు. కొత్తగూడెంలోని పరీక్ష కేంద్రాల వద్ద ఆదివారం బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది నిబంధనలు పక్కాగా అమలు చేశారు. ఆధార్ కార్డుపై ఒక పేరు, హాల్ టికెట్‌లో కొంత మార్పులు ఉండటం వల్ల అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించలేదు. కొందరు అభ్యర్థులు సెల్‌ఫోన్లు, మహిళలు బ్యాగులు, షూలతో పరీక్ష కేంద్రాలకు వచ్చారు. మరికొందరు కారు, స్కూటీలకు సంబంధించిన ఎలక్ట్రికల్ తాళాలు తీసుకొని సెంటర్‌లో వెళ్తుండగా వారందరినీ బయటనే నిలిపి వస్తువులన్నింటినీ బయటనే పెట్టించి, తనిఖీ చేసి లోపలికి పంపించారు. కొత్తగూడెంలోని సింగరేణి పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల వంటి పరీక్ష కేంద్రాలను ఎస్పీ వినీత్ పరిశీలనకు వెళ్లగా అక్కడి సిబ్బంది ఎస్పీని సైతం తనిఖీ చేసి పంపించారు. దివ్యాంగుల కోసం ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడం వల్ల పరీక్ష కేంద్రంలోకి వారు ఇబ్బందులు పడుకుంటూనే వెళ్లారు.



ఆధార్‌లో పేరు సరిగా లేకపోవడంతో అభ్యర్థిని నిలిపివేసిన సిబ్బంది



పరీక్ష కేంద్రం ఎదుట తీగలకు వేలాడదీసిన బెల్టులు

# రేపు రాష్ట్రపతిని కలవనున్న కొండరెడ్లు

**ఐటీడీఏ ఆధ్వర్యంలో ఢిల్లీకి పయనం..**



రాష్ట్రపతిని కలవనున్న అశ్వారావుపేట మండల కొండరెడ్లు

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట : అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని మూడు గ్రామాలకు చెందిన కొండరెడ్డి గిరిజనులు ఈనెల 13న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలవనున్నారు. ఈ మేరకు భద్రాచలం ఐటీడీఏ అధికారుల ఆధ్వర్యంలో 14 మంది కొండరెడ్లు ఆదివారం ఢిల్లీకి బయలుదేరారు. అంతరించిపోతున్న ఆదిమ జాతుల అభివృద్ధి, ఈ తెగల వారికి ఐటీడీఏ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందుతున్న సంక్షేమ పథకాలు, పోషకాహారం, గ్రామాల్లో కనీస వసతులు, తాగునీరు, విద్య, రహదారుల సౌకర్యం, గృహాలు, పోషకాహారం, వారి జీవన విధానం వంటి అంశాలపై రాష్ట్రపతి నేరుగా కొండరెడ్లతో మాట్లాడుతారని తెలిసింది. కాగా, మారుమూల గిరిజన ప్రాంతాల్లోని కొండరెడ్ల ఆవాసాలకు చెందిన తమకు నేరుగా రాష్ట్రపతిని కలిసే అవకాశం దక్కడం పట్ల వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను రాష్ట్రపతికి వివరిస్తామని చెబుతున్నారు. రాష్ట్రపతిని కలిసే వారిలో దమ్మపేట మండలం పూసుకుంట గ్రామ సర్పంచ్ ఉమ్మల దుర్గ, ఆమె భర్త ఉమ్మల రాజిరెడ్డి, బొల్లి నాగిరెడ్డి, ఉమ్మల రామిరెడ్డి, అశ్వారావుపేట మండలం గోగులపూడి, బండారుగుంపు గ్రామాలకు చెందిన చిప్పల యశోద, చిప్పల వైశాలి రెడ్డి, చిప్పల కుమారి, చిప్పల రేణుక, చిప్పల కృష్ణవేణి, చిప్పల విజయరెడ్డి, చిప్పల పద్మావతి, గురుకుంట్ల బాబురెడ్డి, గోగుల మంగిరెడ్డి, గోగుల దుర్గారెడ్డి ఉన్నారు.

# అసెంబ్లీ తీర్మానం రద్దు చేయాలి

**ఏపీఎస్పీ జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వరరావు**



ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

భద్రాచలంటౌన్: తెలుగు రాష్ట్రాల్లో గిరిజనేతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చే అసెంబ్లీ తీర్మానాన్ని వెంటనే రద్దు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ ఆదివాసీల భారీ బహిరంగ సభ నిర్వహించారు. ముందుగా ఏపీఎస్పీ ఆధ్వర్యంలో పట్టణంలోని బ్రిడ్జిసెంటర్ నుంచి క్రీడా మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. 75 సంవత్సరాల స్వతంత్ర దేశంలో రాజ్యాంగబద్ధ హక్కులు, అధికారాలతో పాటు రక్షణ చట్టాలు, ప్రత్యేక రిజర్వేషన్లు, నిధులు ఉన్నా అవి ఆదివాసీలకు అందని ద్రాక్షగా ఉన్నాయన్నారు. విద్య, వైద్యం మౌలిక వసతులు ఆదివాసీలకు ఇప్పటికీ అందడం లేదని తెలిపారు. కొద్దిపాటి రిజర్వేషన్లతో బతుకునీడుస్తుంటే 11 బీసీ ఉప కులాలను ఎస్టీ జాబితాలో కలపడం గిరిజనులపై దాడి చేయడమేనని పేర్కొన్నారు. ఆర్టికల్ 342ను అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి కోసం నాయకులు ఆదివాసీ గిరిజనుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా 11 బీసీ ఉప కులాలను ఎస్టీ జాబితాలో కలిపే కుట్రను ఆపకుంటే ఆదివాసీల నుంచి తిరుబాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శి సున్నం వెంకటరమణ, ఏపీఎస్పీ తెలంగాణ అధ్యక్షుడు ఊకే శంకర్, పూనెం రామచందర్‌రావు, సోడె మురళి, వెంకటేశ్వర్లు, శ్రీను, చంద్రయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాకు కావాల్సింది మామూళ్లే..!

**ఎలాంటి బస్సులనైనా నడుపుకోండి..**

- విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రవాణాశాఖ అధికారులపై ఆరోపణలు
- ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్ తనిఖీలు శూన్యం

కొత్తగూడెంటౌన్: 'మాకు మామూళ్లు ఇస్తే చాలు.. నిబంధనల పట్టింపు ఉండదు.. మేము ఎలాంటి తనిఖీలు చేపట్టం.. ఫిట్‌నెస్ లేని బస్సులను కూడా రోడ్లపై తిప్పుకోనిస్తాం..' అన్నట్లుగా భద్రాద్రి కొత్తగూడెం రవాణాశాఖ అధికారులు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మామూళ్లు ముట్టచెబితే చాలు బస్సులకు పత్రాలు, ఫిట్‌నెస్ వంటివి పట్టించుకోవమని.. అందినకాడికి దోచుకోవడమే తమ పని అన్నట్లుగా విధులు నిర్వర్తిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫిట్‌నెస్ ప్రక్రియను గాలికి వదిలేస్తున్నారనే చర్చ జరుగుతోంది. 2023–2024 విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలకు చెందిన బస్సుల ఫిట్‌నెస్‌ను పరిశీలించి పర్‌ఫెక్ట్ కండీషన్‌లో ఉన్న బస్సులను మాత్రమే రోడ్లపైకి వెళ్లేందుకు అనుమతించాల్సి ఉంది. కానీ, అధికారులు మాత్రం ఫిట్‌నెస్ ప్రక్రియను ఏమాత్రం పట్టించుకోవడం లేదని, మామూళ్లు అందుకొని ఎలాంటి ఫిట్‌నెస్ టెస్టులు లేకుండా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం ఇప్పటివరకు జిల్లాలో ఉన్న ప్రైవేట్ బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తిస్థాయిలో నిర్వహించిన దాఖలాలు లేవని తెలుస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 560కి పైగా ప్రైవేట్ బస్సులు ఉండగా ఈ నెల 7వ తేదీన నిర్వహించిన తనిఖీల్లో కేవలం 200 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారని, మిగిలిన బస్సుల స్థితిగతులను పట్టించుకునేవారే లేరని పలువురు అంటున్నారు. భద్రాద్రి జిల్లాలో 200కు పైగా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. వాటిలో 200కు పైగా బస్సులు ఉండగా వాటిలో కనీసం 10 బస్సులకు కూడా ఫిట్‌నెస్ పరీక్షలను నిర్వహించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా ఫిట్‌నెస్ లేని బస్సుల్లో విద్యార్థులను పాఠశాలలకు, కళాశాలలకు పంపించేందుకు తల్లిదండ్రులు సంకోచిస్తున్నారు. బస్సులను ఫిట్‌నెస్ టెస్టులకు పంపకుండా అధికారులకు మామూళ్లు అందజేస్తున్నారని, అధికారులు కూడా బస్సుల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేయకుండా అనుమతులిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. చాలా బస్సులకు ఫిట్‌నెస్ లేకున్నా అధికారులు అనుమతులివ్వడం, అధికారుల అండ ఉంది కదా అని ఫిట్‌నెస్ లేని బస్సులను ప్రైవేట్ యాజమాన్యాలు ఇష్టారీతిన తిప్పుతున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా రవాణాశాఖ అధికారి, సిబ్బంది స్పందించి పాఠశాలలు, కళాశాలలకు చెందిన ప్రైవేట్ బస్సులను తనిఖీ చేసి ఫిట్‌నెస్ లేని.. 15 ఏళ్లకు పైబడిన వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ఉండాల్సినవి ఇవీ..**

- బస్సుకు అనుమతి పత్రాలు ఉండాలి.
- 15 ఏళ్లకు పైబడిన బస్సులను గుర్తించి చర్యలు తీసుకోవాలి.
- బస్సు ఇంజన్, బ్రేకులు అన్నీ కండీషన్‌లో ఉండాలి.
- బస్సు లేదా వ్యాన్‌కు రెండు వైపులా మిర్రర్స్ పెట్టాలి.
- బస్సు లేదా వ్యాన్‌లకు పసుపు రంగు వేయాలి.
- డ్రైవర్ కూర్చునే సీటు ఎదుట కాన్‌కేవ్ మిర్రర్ ఉండాలి. అందులో బస్సులోని వారంతా కనబడాలి.
- విద్యార్థులు పట్టుకుని ఎక్కేందుకు రెయిలింగ్ ఉండాలి.
- స్కూల్ బ్యాగ్‌లు పెట్టేందుకు సీటు కింద ర్యాక్‌లు ఏర్పాటుచేయాలి.
- ఎమర్జెన్సీ ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలి.
- బస్సుకు రెండు వైపులా పాఠశాల పేరు, మొబైల్ నంబర్ రాయాలి.
- ఎమర్జెన్సీ డోర్ ఉండాలి. అది వర్కింగ్‌లో ఉండాలి.
- బస్సులో ఏదైనా ఒక చోట సుత్తెను ఏర్పాటు చేయాలి.
- ఐదేళ్ల అనుభవం ఉన్న డ్రైవరే బస్సు నడపాలి.
- 60 ఏళ్లు పైబడిన డ్రైవర్లను అనుమతించొద్దు..

### రూ.లక్షలతో ఉడాయించాడు?

**ఓ యువకుడిపై సోషల్ మీడియాలో ప్రచారం**

ములకలపల్లి: ప్రభుత్వ ఉద్యోగాలిప్పిస్తానని నమ్మించి రూ.30 లక్షలతో ఉడాయించినట్లు ఆదివారం వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం జరిగిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కరీంనగర్‌కు చెందిన యువకుడికి మాధారం గ్రామానికి చెందిన యువతితో వివాహం అయింది. కొంతకాలంగా సదరు యువకుడు మాధారంలోనే ఉంటూ కారు డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సదరు యువకుడు నాలుగు రోజులుగా కనిపించకుండాపోవడంతో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రూ.లక్షలతో పరారయ్యాడని ఇద్దరు వ్యక్తులు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. ఐతే సదరు యువకుడు అలాంటి వ్యక్తి కాదని, దురుద్దేశంతోనే అనవసర ఆరోపణలు చేస్తున్నారనే భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కాగా యువకుడి భార్య, బాధితులు న్యాయం చేయాలని వేర్వేరుగా పోలీసులను ఆశ్రయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ ఉదంతంపై ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

### ద్విచక్రవాహనం చోరీ

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఎంపీకాలనీవాసి శ్రీధర్ తన ద్విచక్రవాహనం చోరీకి గురైందని ఆదివారం ఇచ్చిన ఫిర్యాదుపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# బుల్లెట్‌పై వధూవరుల సవారీ!



బుల్లెట్లపై ఫంక్షన్ హాల్‌కు వెళ్తున్న రవితేజ, సింధు

పాల్వంచ: గతంలో ఓ నవవధువు పెళ్లి వేడుక తర్వాత బుల్లెట్ బండి పాటకు నృత్యం చేసిన విషయం అందరికీ గుర్తుండే ఉంటుంది. కానీ ఇక్కడ నూతన వధూవరులిద్దరూ చెరో బుల్లెట్ డ్రైవింగ్ చేస్తూ ఆకట్టుకున్నారు. పాల్వంచకు చెందిన పెండ్యాల రామకృష్ణార్జునరావు – ప్రమీల దంపతుల కుమారుడు రవితేజకు ఏపీలోని లక్కవరానికి చెందిన డాక్టర్ సింధు హిమానీతో ఈనెల 7న వివాహం జరిగింది. వీరి రిసెప్షన్ పాల్వంచలో శనివారం రాత్రి నిర్వహించగా.. నూతన దంపతులు చెరో బుల్లెట్ నడుపుతూ వరుడి ఇంటి నుండి ఫంక్షన్ హాల్ వరకు వచ్చారు. ముందూ, వెనుక బంధువులు, స్నేహితులు వాహనాలపై వస్తూ పూలు చల్లుతుండగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

### పిడుగుపాటుకు పాడిగేదె మృతి

చంద్రుగొండ: మండల కేంద్రం శివారు ఇందిరానగర్‌లో నున్నా వెంకటేశ్వర్లుకు చెందిన పాడిగేదె పిడుగుపాటుకు గురై మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం గాలిదుమారంతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు పెరట్లో ఉన్న కొబ్బరిచెట్టుపై పిడుగుపడింది. పిడుగు దాటికి అక్కడే కట్టేసి ఉన్న పాడిగేదె మరణించింది. గేదె విలువ రూ.65 వేలు ఉంటుందని వెంకటేశ్వర్లు తెలిపాడు.

### అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

అశ్వాపురం: మండలంలోని మొండికుంట గ్రామంలో ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పసుల రాములు పూరిల్లు దగ్ధమైంది. రాములు అతని భార్య ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమిచ్చినా అరగంట వరకు రాకపోవడంతో స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా అదుపులోకి రాలేదు. పూరిల్లు పూర్తిగా కాలిపోవడంతో ఇంట్లో ఉన్న సామగ్రి బూడిదైంది. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.



దగ్ధమవుతున్న పూరిల్లు

## క్లుప్తంగా...


కష్టమర్లకు వస్త్రాలు అందిస్తోన్న వెంకటేష్

### రామ్‌రాజ్ షోరూంను ప్రారంభించిన హీరో వెంకటేష్

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): రామ్‌రాజ్ కాటన్ సంస్థ సంప్రదాయ వస్త్రాలు తయారు చేస్తూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతోందని సినీ హీరో దగ్గుబాటి వెంకటేష్ అన్నారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ 250వ షోరూంను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కాటన్ దుస్తులు ధరిస్తే శరీరానికి హాయిగా ఉండటమే కాకుండా పర్యావరణాన్ని పరిరక్షించినట్లు అవుతోందన్నారు. నెల్లూరులో 100వ షోరూంను కూడా తానే ప్రారంభించానన్నారు. రామ్‌రాజ్ కాటన్ సంస్థ చైర్మన్ కేఆర్ నాగరాజన్ మాట్లాడుతూ.. ధోతీలు, షర్ట్‌లు, ఇన్నర్‌వేర్‌లు, నైట్ వేర్, ఫ్యాబ్రిక్స్, కిడ్స్ అండ్ ఉమెన్స్ వేర్‌లతో పాటుగా అన్ని రకాల శుభకార్యాలకు అవసరమైన వస్త్రాలు తమ షోరూంలో అందుబాటులో ఉంటాయన్నారు.

### విద్యుత్ తీగ తెగి నిలిచిన రైళ్లు

బెల్లంపల్లి: విద్యుత్ ఇంజన్‌కు ప్రమాదశాత్తూ ఓవర్ హెడ్ ఎలక్ట్రిక్ తీగ చుట్టుకుని తెగిపోవడంతో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి – మందమర్రి రైల్వే స్టేషన్ల మధ్య 3 గంటలపాటు రైళ్లు నిలిచిపోయాయి. ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రైల్వే అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం.. గోరఖ్‌పూర్ – మహబూబ్‌నగర్ (నెంబర్ 05303) సమ్మర్ స్పెషల్ ట్రెన్ బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌కు మధ్యాహ్నం 2:48 గంటలకు చేరుకుంది. మంచిర్యాల వైపు వెళ్తుండగా.. బెల్లంపల్లి – మందమర్రి రైల్వేస్టేషన్ల మధ్య 2:55 గంటలకు రైలు ఇంజిన్‌కు ఓహెచ్ఈ తీగ చుట్టుకుని తెగిపోయింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగి రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. రైల్వే ఉన్నతాధికారులు రంగంలోకి దిగి 3 గంటలు శ్రమించి ఓహెచ్ఈ వైరును పునరుద్ధరించారు. సాయంత్రం 5:50 గంటలకు మరమ్మతులు పూర్తిచేసి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు.

**నిలిచిపోయిన రైళ్లు ...**

కోర్బా–కొచ్చివెల్లి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, హజ్రత్ నిజాముద్దీన్–బెంగళూరు రాజధాని ఎక్స్‌ప్రెస్, సిర్పూర్‌టీ)–భద్రాచలం రోడ్ సింగరేణి ప్యాసింజర్ రైళ్లతోపాటు గోరఖ్‌పూర్–మహబూబ్‌నగర్ సమ్మర్ స్పెషల్ నిలిచిపోయాయి.

# ఏపీలో 20 ఎంపీ సీట్లు గెలవాలి

- విశాఖ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా



సాక్షి, విశాఖపట్నం: వచ్చే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో 20 ఎంపీ స్థానాలు గెలవాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. రాష్ట్రానికి కేంద్రం సహకరిస్తున్నందునే అభివృద్ధి సాధ్యమైందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి.. వారి ఆశీర్వాదం కోరాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నాలుగేళ్లుగా అవినీతి ప్రభుత్వం నడుస్తోందని మండిపడ్డారు. ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా బీజేపీ ఆదివారం సాయంత్రం విశాఖలో మహాజన సంపర్క్ అభియాన్ సభ నిర్వహించింది. విశాఖ రైల్వే గ్రౌండ్స్‌లో జరిగిన ఈ సభకు అమిత్‌షా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై విమర్శలు, ఆరోపణలు గుప్పించారు. ఈ నాలుగేళ్లలో జగన్ ప్రభుత్వం అవినీతి ఆరోపణలను, కుంభకోణాలను ఎదుర్కొంటోందన్నారు. రైతుల ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉందన్నారు. ప్రధాని మోదీ ఇచ్చే సొమ్ముతో సీఎం జగన్ రైతు భరోసా పేరిట రైతులను మభ్య పెడుతున్నారని ఆరోపించారు. పేదలకు కేంద్రం ఇచ్చే బియ్యం పథకంపై జగన్ ఫొటో వేసుకుంటున్నారన్నారు. విశాఖ.. సమాజ విరోధ శక్తులకు అడ్డాగా మారిందని, భూ మాఫియా పెరిగిందని విమర్శించారు.

**తొమ్మిదేళ్లలో రూ.10 లక్షల కోట్లు**

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తోందని కేంద్ర మంత్రి అమిత్‌షా అన్నారు. ఏపీకి భారీగా నిధులు కేటాయించడంతో పాటు ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ, ఎయిమ్స్, మెడికల్ కాలేజీలు, ట్రిపుల్ ఐటీ, సెంట్రల్, ట్రైబల్ యూనివర్సిటీలు వంటి పలు కేంద్ర సంస్థలను మంజూరు చేసిందని చెప్పారు. 2009 – 2014 వరకు యూపీఏ ప్రభుత్వం ఏపీకి పన్నులు, గ్రాంట్ల రూపంలో రూ.78 వేల కోట్లు ఇస్తే మోదీ పాలన తొమ్మిదేళ్లలో రూ.10 లక్షల కోట్లు ఇచ్చారని తెలిపారు. 2014 నాటికి రాష్ట్రంలో నాలుగు వేల కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉండగా, ఇప్పుడవి 9 వేల కిలోమీటర్లకు విస్తరించాయన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుతో పాటు విశాఖ–సికింద్రాబాద్, తిరుపతి–సికింద్రాబాద్‌ల మధ్య వందేభారత్ రైళ్లు, కాకినాడలో బల్క్ డ్రగ్ పార్క్ వంటివి ప్రధాని మోదీ మంజూరు చేశారని చెప్పారు. విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి, అమరావతిలను స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు.

**కుంభకోణాలకు తావులేని పాలన**

దేశంలో 2004 నుంచి 2014 వరకు సోనియాగాంధీ నేతృత్వంలోని మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం రూ.12 లక్షల కోట్ల అవినీతికి, ఎన్నో కుంభకోణాలకు పాల్పడిందని, అందుకు బాధ్యులపై చర్యలూ తీసుకోలేదని అమిత్ షా ఆరోపించారు. నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో ఒక్క అవినీతి కుంభకోణం జరగలేదన్నారు. పైగా ప్రపంచ దేశాల్లో భారత్ గౌరవాన్ని మోదీ పెంచారన్నారు. మోదీ ప్రధాని అయ్యాక దేశంలో ప్రతి ఇంటికి విద్యుత్, మరుగుదొడ్డి సదుపాయం కల్పించారన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ 300 లోక్‌సభ స్థానాలు దక్కించుకుంటుందని జోస్యం చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ఆ పార్టీ నేతలు సత్యకుమార్, పురందేశ్వరి, విష్ణుకుమార్‌రాజు తదితరులు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ సభలో కేంద్ర మంత్రి మురళీధరన్, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, పార్టీ నేతలు సునీల్ ధియోదర్, జీవీఎల్ నరసింహారావు, టీజీ వెంకటేష్, సీఎం రమేష్, సుజనాచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీయే మా ప్రథమ శత్రువు


కొత్తగూడెం సభలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు, వేదికపై నారాయణ తదితరులు

▶ మొదటి పేజీ తరువాయి

అమ్ముడుపోయారని, పోరాటాలు మరిచిపోయారని విమర్శించడం బండి సంజయ్‌కు తగదన్నారు. తన పదవి ఉంటుందా, ఊడుతుందా అనే దానిపై సంజయ్ దృష్టి సారిస్తే మంచిదని అన్నారు. రోజుకో పార్టీ మారేవాళ్లు, అధికారం కోసం పశువుల్లా వ్యవహరించే వాళ్లు, ఏసీ రూముల్లో కూర్చునే వాళ్లు.. తమకు నీతులు చెబుతారా అంటూ నిప్పులు చెరిగారు. కమ్యూనిస్టుల ఊపిరిలోనే పోరాటం ఉందని ఆయన పేర్కొన్నారు.

**ప్రజల గోడు కేసీఆర్ వినాలి**

తెలంగాణ ఏర్పాటుకు మొదటగా మద్దతు పలికిన జాతీయ పార్టీ సీపీఐ అని కేసీఆర్ ఎన్నో సార్లు చెప్పారని, కానీ ఈ రోజు దశాబ్ది ఉత్సవాల్లో తమ ఊసే లేకుండా పోయిందని కూనంనేని అన్నారు. ఓ తండ్రిలా రాష్ట్ర ప్రజల కష్టసుఖాలను వినాల్సిన బాధ్యత సీఎం కేసీఆర్‌పై ఉందని, బాధలు చెప్పుకునే అవకాశం ప్రజలకు ఇవ్వాలని సూచించారు. అంతర్గత కుమ్ములాటను చక్కదిద్దుకుంటే తప్ప బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిలబడలేదని పేర్కొన్న ఆయన.. ప్రస్తుతం కేసీఆర్ రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా బలంగా నిలబడ్డారని చెప్పారు.

**ఫ్రంట్‌లో చేరకపోతే సందేహాలొస్తాయి..**

బీజేపీకి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఏర్పడుతున్న ఫ్రంట్‌లోకి రావాలని ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ కోరారు. లేదంటే బీజేపీకి వ్యతిరేకంగా కేసీఆర్ చేస్తున్న పోరాటంపై సందేహాలకు ఆస్కారం ఉంటుందని అన్నారు. ఇటీవల బీజేపీపై విమర్శల వాడిని కేసీఆర్ తగ్గించారని, కానీ ఒక్కసారి బీజేపీకి లొంగిపోతే మరింతగా బీఆర్ఎస్‌పై బీజేపీ దాడి చేస్తుందని చెప్పారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని బీజేపీకి వ్యతిరేకంగా మరింత గట్టిగా పోరాటం చేయాలని కేసీఆర్‌కు సూచించారు.

**మేము ఏమైనా సన్యాసులమా..?**

ప్రజాగర్జన సభను కొందరు ఎన్నికల బహిరంగ సభ అంటున్నారని, మేము ఎన్నికల బహిరంగ సభ పెడితే తప్పేమిటని నారాయణ ప్రశ్నించారు. 'మేము రాజకీయ పార్టీ నడిపిస్తున్నాం. అసెంబ్లీ, పార్లమెంట్‌లో మా సభ్యులు ఉండాలని కోరుకుంటున్నాం. అలాంటప్పుడు మేము ఎన్నికల బహిరంగ సభ పెడితే తప్పేంటి. మేము ఏమైనా సన్యాసులమా? రాజకీయ ఆకాంక్షలు లేకుండా ఉండటానికి..' అని ప్రశ్నించారు.

**పొత్తుల చర్చ వస్తే చంద్రబాబు ల్యాప్‌టాప్ ఓపెన్ చేస్తారు..**

'ఎన్నికల పొత్తులో భాగంగా సీట్ల కేటాయింపుల అంశం చర్చకు వస్తే చంద్రబాబు లాప్‌టాప్ ఓపెన్ చేస్తారు. ఏ సీటులో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయో అంటూ లెక్కలు వివరించడం మొదలెడతారు. గతంలో ఓసారి నాకు కూడా ఇలాగే ల్యాప్‌టాప్ పాఠాలు చెప్పేందుకు ప్రయత్నించాడు. నేను వెంటనే హే! ఆపవయ్యా బాబు.. నీకు పూర్తి బలం ఉంటే మాతో ఎందుకు పొత్తు పెట్టుకుంటున్నావ్? అని అడిగా..' అని నారాయణ చెప్పారు.

**మోదీకి 30 మంది దత్తపుత్రులు**

నాకు కుటుంబం లేదని, కుటుంబాలు ఉన్న కేసీఆర్ వంటి నేతలు అవినీతికి పాల్పడుతుంటారని మోదీ తరచుగా విమర్శలు చేస్తుంటారు కానీ, మోదీకి 30 మంది దత్త పుత్రులు ఉన్నారని, వీరంతా కార్పొరేట్ శక్తులుగా బ్యాంకులను దోచుకుంటున్నారని నారాయణ ఆరోపించారు. మోదీ గద్దం పెరుగుతున్నట్టుగా దేశంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని విమర్శించారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపైనా ఆరోపణలు చేశారు. కేంద్ర కేబినెట్‌లో 24 మంది క్రిమినల్స్ ఉన్నారని పేర్కొన్నారు.

# తొమ్మిదేళ్లుగా కాలయాపనే..!

## వలస కార్మికుల సంక్షేమంపై నీలినీడలు

- తెలంగాణ ఏర్పాటుకు ముందు గల్ఫ్‌వలస కార్మికులకు వరాల జల్లు
- ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా ప్రవాసులకు అందని ఫలాలు
- దశాబ్ది వేడుకల సందర్భంగానైనా సర్కారు స్పందించాలని డిమాండ్



మోర్తాడ్(బాల్కొండ): వలస కార్మికుల సంక్షేమంపై తెలంగాణ ప్రభుత్వం నేటికీ నాన్చుడు ధోరణి అవలంబిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి గల్ఫ్ బాట పట్టిన కార్మికుల గురించి ప్రభుత్వం కనీసంగా ఆలోచన చేయకపోవడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ ఏర్పాటుకు ముందు ప్రవాస కార్మికులకు వరాల జల్లు కురిపించిన నాయకులు గద్దెనెక్కిన తర్వాత వారి సంక్షేమం విస్మరించడం విస్మయానికి గురిచేస్తోంది. తొమ్మిదేళ్లుగా పట్టించుకోని నేతలు దశాబ్ది వేడుకల సందర్భంగానైనా ప్రవాసీ విధానం, గల్ఫ్ బోర్డు అమలుపై దృష్టి సారించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

- తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో వలస కార్మికుల అంశంపై ప్రత్యేక చర్చ జరిగింది. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత గల్ఫ్ వలసలు తగ్గుతాయని అందరు భావించారు. కానీ ఇందుకు భిన్నంగా వలసలు మరింత ఎక్కువ కావడం గమనార్హం.

**ప్రవాసీ విధానంపై అధ్యయనం చేసినా..**

గల్ఫ్ దేశాలకు మన రాష్ట్రం నుంచి వలసలు పెరుగుతుండడంతో ప్రవాసీ విధానం అమలు చేసి వలస కార్మికుల కోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 2020 జనవరిలో అప్పటి ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, సీఎం ముఖ్య కార్యదర్శి నర్సింగరావుల బృందం కేరళ వెళ్లి అక్కడ వారం రోజుల పాటు ప్రవాసీ విధానంపై అధ్యయనం చేసింది. సీఎం ముఖ్య కార్యదర్శి నర్సింగరావు నేతృత్వంలో పాపారావు అనే మరో అధికారి ప్రవాసీ విధానంపై ముసాయిదాను సైతం తయారు చేశారు. కానీ ఇప్పటి వరకు ప్రవాసీ విధానం గానీ, గల్ఫ్ బోర్డు అంశంపై ఎలాంటి స్పందన లేదు.

**బడ్జెట్ సమావేశాల్లో ప్రత్యేకంగా ప్రస్తావన**

రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో వలస కార్మికుల సంక్షేమం, వారు విదేశాల నుంచి మన రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్న తీరుపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. మంత్రి హరీశ్‌రావు 2022 నాటి బడ్జెట్ ప్రసంగంలో వలస కార్మికుల రుణం తీర్చుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని హామీ ఇచ్చారు. ఒకే ఒక్కసారి 2018లో ఎన్ఆర్ఐ సెల్‌కు రూ.100 కోట్లు కేటాయించినా మార్గదర్శకాలను జారీ చేయకపోవడంతో నిధులను ఖర్చు చేయలేదు.

**తొమ్మిదేళ్లలో 1,800ల మంది మృతి**

ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లిన వలస కార్మికుల్లో కొంత మంది వివిధ కారణాలతో గత తొమ్మిదేళ్లలో 1,800ల మంది మృతి చెందారు. గల్ఫ్ దేశాల నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న శవపేటికలే ఇందుకు సాక్ష్యమని వలస కార్మికుల సంఘాల నేతలు పేర్కొంటున్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబానికి రూ. 5లక్షల చొప్పున సాయం అందిస్తే రూ. 90 కోట్లు అవసరం అవుతుంది. రాష్ట్రాభివృద్ధికి ఏటా లక్ష కోట్లకుపైగా బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తున్న ప్రభుత్వం మృతి చెందిన వలస కార్మికుల కోసం రూ.90కోట్లను ఎందుకు కేటాయించడం లేదన్న వాదనలు వెల్లువెత్తుతున్నాయి.

**పట్టించుకోకపోతే ఇబ్బందులే..**

వలస కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించకపోతే అధికార పక్షానికి ఇబ్బందులు తప్పవు. కరోనా వేళ ఎంతో మంది సొంతూళ్లకు చేరుకున్నారు. ఇక్కడ సరైన ఉపాధి లేక మళ్లీ గల్ఫ్ బాట పట్టారు. వలస కార్మికులతో ప్రభుత్వాలకు ఆదాయం లభిస్తున్నా వారి సంక్షేమం గురించి ఆలోచన చేయకపోవడం విచారకరం.

– మంద భీంరెడ్డి, గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకులు

**ఎన్ఆర్ఐ పాలసీ అమలు చేయాలి**

రాష్ట్రంలో ఎన్ఆర్ఐ పాలసీని అమలు చేయకపోతే ఉద్యమం తప్పదు. ఏళ్ల తరబడి వలస కార్మికులు ఎన్నో ఇబ్బందులకు ఓర్చుకుంటూ గల్ఫ్ బాటనే ఎంచుకున్నారు. ఇతర దేశాలకు వెళ్తున్న వారిలో అందరు పేద, మధ్య తరగతి కుటుంబాల వారే ఉన్నారు. ప్రవాసీ విధానంతో వలస కార్మికుల బతుకుల్లో మార్పు వస్తుందనే నమ్మకం ఉంది.

– కృష్ణ దొనికెని, వ్యవస్థాపకులు గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక

జిల్లా వార్తలు

### నేడు షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం


నిర్మాణం పూర్తయిన షాపింగ్ కాంప్లెక్స్

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయం ఎదుట నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను సోమవారం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రారంభిస్తారని ఈఓ ఎస్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ రూ.1.2కోట్లతో కాంప్లెక్స్ నిర్మించామని తెలిపారు. ధర్మకర్తలు చింత నాగరాజు, ఆచార్యులు, వెంకటరామారావు, కె.నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, జి.వెంగళరావు, పాపయ్యదొర పాల్గొన్నారు.

### 'దశాబ్ది' ప్రగతిపై రవాణా శాఖలో ప్రచారం


ఖమ్మం ఆర్టీఓ కార్యాలయంలోని టీవీ

ఖమ్మంక్రైం: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తొమ్మిదేళ్లలో సాధించిన ప్రగతిని రవాణా శాఖ ఆధ్వర్యాన విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈమేరకు ఖమ్మంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో టీవీ ఏర్పాటుచేసిన తెలంగాణ ఏర్పడ్డాక రవాణా శాఖలో తీసుకొచ్చిన సంస్కరణలు, ఆన్‌లైన్ సేవలను వివరిస్తున్నారు. అలాగే, జాతీయ స్థాయి ప్రమాణాలతో సిరిసిల్లలో నిర్మించిన డ్రైవింగ్ ట్రాక్ దృశ్యాలను ప్రసారం చేస్తున్నారు.

### నేడు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

మధిర: గోఆధారిత సేంద్రియ వ్యవసాయంపై మహబూబాబాద్ జిల్లాలో సోమవారం అవగాహన సదస్సు జరగనుందని ప్రకృతి వ్యవసాయ రైతు కుడుముల వెంకట్రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆది గురుభారత్ సంఘం, అరబిందో ఫార్మా ఆధ్వర్యాన మహబూబాబాద్ జిల్లా తాళ్లపూసపల్లిలోని రైతు జయపాల్‌రెడ్డి మామిడి తోటలో ఈ సదస్సు నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్, నల్లగొండ, వరంగల్ జిల్లాల రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# ఆకు లక్ష్యం.. ఆమడదూరంలో...


అభయారణ్యంలో తునికాకు సేకరిస్తున్న మహిళలు

- నెరవేరని తునికాకు సేకరణ లక్ష్యం
- 35,100 స్టాండర్డ్ బ్యాగుల్లో 21,748 బ్యాగులే పూర్తి
- ప్రభావం చూపిన అకాల వర్షాలు, 'ఉపాధి' పథకం


సేకరించిన తునికాకు కట్టలు కడుతున్న గిరిజనులు

పాల్వంచరూరల్: తునికాకు సేకరణ లక్ష్యం ఈ ఏడాది కూడా ఆమడదూరంలోనే ఆగిపోయింది. గతేడాది 70శాతం లక్ష్యాన్ని సాధించగా, ఈ ఏడాది 64.53శాతమే పూర్తయింది. గత ఏప్రిల్ ఆఖరు నుంచి ఈనెల మొదటి వారం వరకు గిరిజనులు, గిరిజనేతరులు తునికాకు సేకరణ చేశారు. అయితే, సీజన్ మొదట్లో అకాల వర్షాలు కురవడం, ఎక్కువ శాతం మంది ప్రజలు ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లడం కారణంగా తునికాకు సేకరణ లక్ష్యం నెరవేరలేదని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఆరు డివిజన్ల పరిధిలో ఈ ఏడాది 35,100 స్టాండర్డ్ బ్యాగుల తునికాకు(యాభై ఆకుల కట్టలు వెయ్యి కలిపితే ఒక స్టాండర్డ్ బ్యాగ్) సేకరించాలనే లక్ష్యంగా నిర్దేశించారు. కానీ 21,748 బ్యాగ్‌ల సేకరణే పూర్తయింది. గతేడాది కూడా 35,100 బ్యాగుల లక్ష్యమే ఉండగా.. 24,520 బ్యాగ్‌ల ఆకు సేకరించారు.

**డివిజన్ల వారీగా సేకరణ..**

భద్రాద్రి జిల్లాలోని అటవీ డివిజన్ల వారీగా తునికాకు సేకరణ లక్ష్యం, సాధించిన వివరాలిలా ఉన్నాయి. కిన్నెరసాని అభయారణ్యం డివిజన్‌లో 3,200 స్టాండర్డ్ బ్యాగ్‌ల లక్ష్యానికి 2,402.98 స్టాండర్డ్ బ్యాగుల ఆకు సేకరణ పూర్తయింది. ఇక్కడ గత ఏడాది 5వేల బ్యాగ్‌లకు గాను 1,954 బ్యాగ్‌లే సేకరించారు. కొత్తగూడెం డివిజన్ పరిధిలో ఈ ఏడాది 3,900 బ్యాగ్‌లకు 1,444.92 బ్యాగ్‌లు, గత ఏడాది 3,900 బ్యాగ్‌ల్లో 1,513 బ్యాగ్‌ల ఆకు సేకరణ చేపట్టారు. ఇల్లెందు డివిజన్ పరిధిలో ఈఏడాది 10,600 బ్యాగ్‌లకు గాను 6,646.30 బ్యాగ్‌లు, గతేడాది 11,500 బ్యాగ్‌లకు గాను 7,197 బ్యాగ్‌లు, భద్రాచలం డివిజన్ పరిధిలో ఈ ఏడాది 9,700 బ్యాగ్‌లకు 5,051.90 బ్యాగ్‌లు, గతేడాది 9,400 బ్యాగ్‌లకు 7,733 స్టాండర్డ్ బ్యాగుల ఆకు సేకరణ పూర్తయింది. ఇక మణుగూరు డివిజన్‌లో ఈ ఏడాది 5,400 బ్యాగ్‌లకు గాను 4,987.30 బ్యాగ్‌లు, గతేడాది 6,200 బ్యాగ్‌లకు గాను 4,759 బ్యాగ్‌లు, పాల్వంచ డివిజన్‌లో ఈ ఏడాది 2,300 స్టాండర్డ్ బ్యాగ్‌లకు గాను 1,214.60 స్టాండర్డ్ బ్యాగ్‌లు, గతేడాది 1,362 స్టాండర్డ్ బ్యాగుల తునికాకు సేకరించారు.

**మొదలవడమే ఆలస్యం**

సహజంగా ఏటా ఏప్రిల్ నెలాఖరు నుంచే తునికాకు సేకరణ మొదలవుతుంది. కానీ ఈసారి వారం, పది రోజుల పాటు ఆలస్యంగా ప్రారంభమైంది. నెల పాటు గిరిజన కూలీలు తునికాకు సేకరణలో నిమగ్నమవుతారు. వేకువజాము నుంచే కూలీలు అడవి ప్రాంతానికి వెళ్లి మధ్యాహ్నం వరకు తునికాకు సేకరిస్తారు. ఆతర్వాత ఆకును ఇళ్లకు చేర్చి 50 ఆకుల చొప్పున కట్టలు కట్టి తీసుకెళ్లి కల్లాల్లో అప్పగిస్తారు.

**ఈసారి సేకరణ తగ్గింది**



జిల్లాలోని అటవీ డివిజన్ల పరిధిలో తునికాకు సేకరణ ఈసారి తగ్గింది. అకాల వర్షాలకు తోడు గిరిజనులు ఉపాధి హామీ పనుల వైపు మొగ్గు చూపడం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. దీంతో అనుకున్న లక్ష్యాన్ని చేరలేదు. గతంలో తునికాకు సేకరణకు ఏజెన్సీలోని గ్రామాల ప్రజలు, ప్రధానంగా గిరిజనులు ముందుకొచ్చేవారు. భద్రాద్రి జిల్లాలో నాణ్యమైన తునికాకు లభిస్తున్నా.. సేకరణకు చాలా మంది ఆస్తి చూపడం లేదు.

– లక్ష్మణ్ రంజిత్‌నాయక్, భద్రాద్రి జిల్లా అటవీ శాఖాధికారి

# ఏపీలో ఇచ్చారు.. ఇక్కడా ఇవ్వండి..

1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల వేడుకోలు

సత్తుపల్లి: 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు 4,075 మందికి ఏపీలో ఉపాధ్యాయులుగా పోస్టింగ్ ఇచ్చిన నేపథ్యాన తెలంగాణలో కూడా ఇవ్వాలని పలువురు అభ్యర్థులు కోరారు. సత్తుపల్లిలోని కళాభారతిలో ఆదివారం డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల సమావేశం జరిగింది. ఈసమావేశంలో బొర్రా శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాసరావు, జానీ మాట్లాడుతూ.. అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వడంపై ఏడాది క్రితం మంత్రివర్గ ఉపసంఘం నియమించినా ఫలితం లేదని తెలిపారు. రాష్ట్రంలో 1,500 మంది వరకు అభ్యర్థులు ఉండగా, కొందరికి వయోపరిమితి దాటిందని మరికొందరు చనిపోయారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ తరహాలో మినిమమ్ టైం స్కేల్ పద్ధతిలోనైనా పోస్టులు ఇవ్వాలని కోరారు. కోర్టుల సూచనలు ఉన్నా అధికారులు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించి తమకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. ఇంకా ఈ సమావేశంలో కోటారెడ్డి, ఎంఎస్ఎన్ చారి తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగాలు ఇవ్వాలని పోస్టర్లు ప్రదర్శిస్తున్న 1998 డీఎస్సీ అభ్యర్థులు

# కాలిపోయిన పత్తికి బీమా వర్తించేలా చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ చైర్‌పర్సన్ శ్వేత

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.41లక్షల పైచిలుకు పత్తి కాలిపోగా, బాధిత వ్యాపారికి బీమా అందేలా చర్యలు తీసుకుంటామని మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత తెలిపారు. ఖమ్మం మార్కెట్‌లో ఆదివారం ఆమె చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో సమావేశమై అగ్నిప్రమాదంలో నష్టంపై చర్చించారు. పత్తి కొనుగోళ్లు ఈ–నామ్ విధానంలో జరుగుతున్నందున శ్రీ శివ గణేష్ కృష్ణ ట్రేడర్స్ వ్యాపారి చిత్తూరి శ్రీనివాస్ నష్టపోయిన పత్తి బస్తాల వివరాలు నమోదైనందున పరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఘటనపై దర్యాప్తు జరిపిస్తామని చైర్‌పర్సన్ తెలిపారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఘటనకు పాల్పడి ఉంటే చట్టపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇక నుంచి మార్కెట్‌లో ఫైరింజన్ అందుబాటులో ఉండేలా చూస్తామని ఆమె తెలిపారు. మార్కెట్ వైస్ చైర్మన్ షేక్ అఫ్జల్, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం, డైరెక్టర్లు గుండ్ల ముత్తయ్య, మందా రామకృష్ణ, గ్రేడ్–2 కార్యదర్శి బి.బజార్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతెల శ్రీశైలంతో పాటు సోమా నర్సింహారావు, మన్నెం కృష్ణ, నల్లమల ఆనంద్, చెరుకూరి సంతోష్, ఎడ్లపల్లి సతీష్, ముత్యం ఉప్పల్‌రావు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలపై సమరానికి సన్నద్ధం


సమావేశంలో మాట్లాడుతున్న ఆజాద్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామల ఆజాద్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సంధ్య అన్నారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి స్కూళ్లు ప్రారంభం కానున్నప్పటికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ చేరలేదన్నారు. అంతేకాక పాఠశాలల్లో తరగతి గదులు, టాయిలెట్ల కొరత, ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై పట్టించుకోలేదని ఆరోపించారు. ఇవన్నీ పక్కన పెట్టి తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. మన ఊరు – మన బడి పథకానికి నిధుల కేటాయింపు సక్రమంగా జరగక ఆశించిన స్థాయిలో పాఠశాలల్లో సౌకర్యాలు సమకూరలేదని తెలిపారు. మరోపక్క ప్రైవేట్ విద్యాసంస్థలు తల్లిదండ్రుల నుంచి భారీగా ఫీజులు దండుకుంటున్నా.. ప్రభుత్వం, విద్యాశాఖ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు కిరణ్, దీపిక, నవీన్, వినయ్, శశి, కరుణ్, కార్తీక్, రాజేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాదాయ శాఖ మహిళా ఉద్యోగులకు పోటీలు


పోటీల్లో భాగంగా ముగ్గులు వేస్తున్న మహిళా ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యాన ఆదివారం మహిళా ఉద్యోగులకు ముగ్గులు, క్రీడా పోటీలు నిర్వహించారు. ఖమ్మంలోని శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానంలో జరిగిన ఈ పోటీలు జరిగాయి. అవతరణ వేడుకల్లో భాగంగా మంగళవారం మహిళా సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించనున్న దృష్ట్యా పోటీలు ఏర్పాటుచేశామని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ ఏ.సులోచన తెలిపారు. పోటీల్లో విజేతులకు ఈనెల 21వ తేదీన జరిగే ఆధ్యాత్మిక దినోత్సవంలో బహుమతులు అందజేస్తామని చెప్పారు. శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత, అర్చక, ఉద్యోగులు దాములూరి వీరభద్రరావు, చుండూరు రామకోటేశ్వరరావు, కృష్ణమాచార్యులు, రామశర్మ, ఎస్వీడీ.ప్రసాద్, బి.మురళి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.